www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 3 నవంబర్ 2024

5

కాకినాడ

## నేడు సిపిఎం కాకినాడ నగర మహాసభ

ప్రజాశక్తి - కాకినాడ

సిపిఎం కాకినాడ నగర మహాసభ నేడు స్థానిక అన్నదాన సమాజం(చుక్కన సత్యనారాయణరాజు నగర్)లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మూడేళ్లకోసారి శాఖ స్థాయి నుంచి అఖిలభారత స్థాయి వరకూ ప్రజా ఉద్యమాలను, పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవడానికి మహాసభలు జరుగుతూ ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలోనే సిపిఎం నగర మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ సభలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జీ, జి.బేబీరాణి పై కమిటీ నుంచి పరిశీలకులుగా హాజరవుతారని తెలిపారు.

# గిరిజన విద్యార్థుల గోడు పట్టదా..?

- కాకినాడలో వందలాది విద్యార్థులు
- హాస్టల్ సౌకర్యం లేక ఇక్కట్లు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఉన్నత చదువుల కోసం జిల్లా కేంద్రం కాకినాడకు వస్తున్న గిరిజన విద్యార్థులకు వసతి కరువైంది. ఇక్కడకు అల్లూరి సీతారామరాజు, ఏలూరు, అనకాపల్లి జిల్లాల నుంచి వందలాదిగా విద్యార్థులు వస్తున్నారు. చదువుకోవడానికి ఆసక్తి ఉన్నా ప్రభుత్వం హాస్టల్స్ సౌకర్యం కల్పించకపోవడంతో అనేకమంది విద్యకు దూరమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సరిపడా వసతి గృహాలను స్థానికంగా నిర్మించాలని గిరిజన విద్యార్థులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రం కాకినాడలో అనేక విద్యాసంస్థలు ఉన్నాయి. జెఎన్‌టియుకెతో పాటు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ), ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ వంటి ప్రముఖ కాలేజీలు ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన సుమారు 20 వేల మందికిపైనే ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరితో పాటు గిరిజన గ్రామాల నుంచి ఉన్నత విద్య కోసం సుమారు 500 మంది జిల్లా కేంద్రం కాకినాడకు చదువు కోసం వస్తున్నారు. డిగ్రీ ఇంటర్‌తో పాటు వివిధ కోర్సుల్లో చేరిన వారు ఉన్నారు. అయితే జెఎన్‌టియుకె వద్ద ప్రభుత్వ బాలుర ఎస్‌టి హాస్టల్, కర్ణం గారి జంక్షన్ వద్ద ప్రభుత్వ బాలికల ఎస్‌టి హాస్టల్ ఉన్నా వాటిల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. దీంతో పలువురు విద్యార్థులు ప్రయివేటు హాస్టళ్లలో ఉండాల్సి వస్తుది. స్తోమత లేని అనేకమంది ప్రభుత్వ వసతి గృహాల్లోనే ఉంటున్నారు.

### హాస్టల్ ఏర్పాటుపై అనేక సార్లు వినతి

కాకినాడ శివారున ఉన్న జగన్నాథపురం ప్రాంతంలో ఆంధ్ర పాలిటెక్నిక్, ఎంఎస్ఎన్ డిగ్రీ కాలేజ్, ఎంఎస్ఎన్ జూనియర్ కాలేజ్, ఉమెన్స్ జూనియర్, ఉమెన్స్ డిగ్రీ కాలేజీలు ఉండగా వీటిల్లో దాదాపు 6 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే కర్ణంగారు జంక్షన్‌లో ఉన్న హాస్టల్ నుంచి జగన్నాథపురం వరకూ సుమారు 5 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి చదుకోవాల్సి వస్తుందని గిరిజన విద్యార్థులు తెలిపారు. దీంతో సమయం వృథా అవుతుండడమే కాకుండా తీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జెఎన్‌టియుకె వద్ద ఉన్న బాలుర హాస్టల్ నుంచి పిఆర్ జూనియర్, డిగ్రీ, ఒకేషనల్, ఐడియల్, సిబిఎన్ వంటి కళాశాలలకు సుమారు 4 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తుంది. జగన్నాథపురం కేంద్రంగా పలు విద్యాసంస్థలు ఉన్న నేపథ్యంలో అక్కడ ఎస్‌టి బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. గిరిజన ఎస్‌టి బాలికల కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని గతంలో అనేకసార్లు భారత విద్యార్థి పెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. నేరుగా గత కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. కానీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. భానుగుడి ప్రాంతంలో ఎస్‌టి బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

### ఇబ్బందుల్లో గిరిజన విద్యార్థులు

సుదూర ప్రాంతం నడిచి వెళ్లి చదువుకోవాలంటే గిరిజన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జగన్నాథపురం ఏరియాలో, అలాగే భానుగుడి సెంటర్ సమీపంలోనూ బాలుర, బాలికల గిరిజన వసతి గృహాలను ఏర్పాటు చేయాలి. దీనిపై అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా నేటికీ స్పందన లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలి.

పి.వరహాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

### సమస్యను పరిష్కరించాలి

కర్ణం గారి జంక్షన్‌లో ఉన్న హాస్టల్ నుంచి సుమారు 5 కిలోమీటర్లు నడిచి జగన్నాథపురం వెళ్లాల్సి వస్తుంది. రోజు నడిచి వెళ్లి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మా సమస్యను వెంటనే పరిష్కరించాలి.

-పి.సుమన్, పీజీ విద్యార్థి

## రహదారుల మరమ్మతులకు శ్రీకారం

**పలు రహదారుల మరమ్మతు పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శనివారం జిల్లాలోని వివిధ కేంద్రాల్లో ఎంఎల్‌ఎలు, అధికారులు ఆయా మరమ్మతు పనులకు శంకుస్థాపనలు చేపట్టారు.**

మరమ్మతుల పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - యంత్రాంగం

**పిఠాపురం** గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డ్రైవర్స్ కాలనీ వద్ద పిఠాపురం - కొండెవరం రోడ్డు మరమ్మతు పనులకు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్ఎస్ఎన్.వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీనివాసు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారు లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను గుంతల రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. తొలి దశలో జిల్లాకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. పిఠాపురం నియోజక వర్గానికి సంబంధించి రూ.2.60 కోట్లతో ఆర్ అండ్ బి రహదారుల మరమ్మతులు చేపట్టడం జరుగు తుందన్నారు. జిల్లాలో ప్రారంభించిన ప్రతి పని సకా లంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ జి.కాంతు, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **పెద్దాపురం** పెద్దాపురం - జగ్గంపేట రహదారిలోని పాండవుల మెట్ట ఫైర్ స్టేషన్ వద్ద ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన్న రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ గుంతల పూడ్చివేతలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** తాళ్లరేవు మెయిన్ రోడ్డు మరమ్మతు పనులకు ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా రూ.3.20 కోట్లతో రహదారులకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద, ఆర్ అండ్ బి ఎఇ లక్ష్మీప్రసన్న, నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, పాల్గొన్నారు. **సామర్లకోట** పట్టణంలోని కెనాల్ రోడ్డు మరమ్మతు పనులకు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామితో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, రాజా సూరిబాబురాజు, పాలకుర్తి శ్రీనుబాబు, వల్లూరి దొరబాబు పాల్గొన్నారు.

## 4, 5 తేదీల్లో డిప్యూటీ సిఎం పవన్ పర్యటన

ప్రజాశక్తి - పిఠాపురం

ఈ నెల 4, 5 తేదీల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 4వ తేదీ ఉదయం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో దిగి రోడ్డు మార్గంలో గొల్లప్రోలు జడ్‌పి హైస్కూల్‌కి చేరుకుంటారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. అనంతరం చేబ్రోలులోని ఆయన స్వగృహానికి చేరుకుంటారు. అనంతరం సాయంత్రం పిఠాపురంలో ఉన్న టిటిడి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. ఇంటిగ్రేటెడ్ ఎస్‌సి బాలికల హాస్టల్, బాదం మాధవరావు ప్రభుత్వ బాలుకోన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేస్తారు. అనంతరం అక్కడినుంచి కాకినాడ రూరల్‌లోని పి.వెంకటాపురం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను పరిశీలిస్తారు. అక్కడినుంచి చేబ్రోలుకు చేరుకుంటారు. 5వ తేదీన చేబ్రోలు నుంచి బయలుదేరి యు.కొత్తపల్లి పిహెచ్‌సిలో అవుట్ పేషెంట్ బ్లాకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే పలు ప్రాంతాల్లో ఎంపిపి స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం అక్కడి నుంచి చేబ్రోలుకు చేరుకుని అదే రోజు సాయంత్రం రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు వెళ్తారు.

## నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - గండేపల్లి

దామోదర్

మండలంలో ఈ నెల 21, 22, 23, వరకూ జరిగే నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పిట్లు చేస్తున్నట్లు సెక్టార్ ఆఫీసర్ బి.దామోదర్ తెలిపారు, మండలంలో సుమారు 13 చెరువులు, పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు రైతులతో కమిటీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గతంలో 6 సంవత్సరాల కాల పరిమితి ఉండేదని, ప్రస్తుతం దానికి 5 సంవత్సరాలకు కుదించినట్లు చెప్పారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు రెండేళ్లకోసారి మారతారని తెలిపారు. ఈ కమిటీలో ఆరుగురు సభ్యులు ఉంటారని ఆయన తెలిపారు.

## విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ర్యాలీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యాక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఫీజురియంబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్.నరసింహమూర్తి, బాలగంగాధర్, సాయి, సిద్దు, వెంకట్, రాజేష్, ప్రసన్న, సింధు పాల్గొన్నారు.

## 9వ రోజు కొనసాగిన క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న క్లాప్ డ్రైవర్లు

బకాయి జీతాలను చెల్లించాలని కోరుతూ క్లాప్ డ్రైవర్లు చేపట్టిన ఆందోళన 9వ రోజు కొనసాగింది. వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేస్తున్న క్లాప్ డ్రైవర్లు శనివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లకు రావాల్సిన బకాయి జీతాలను చెల్లించాలని ఆందోళన చేస్తున్నా మున్సిపల్, జిల్లా అధికారుల్లో ఏమాత్రం స్పందన లేకుండా పోయిందన్నారు. అందుకే కార్మికులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారని అన్నారు. రాజ్యాంగం ద్వారా కార్మికులకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అనేక హక్కులను కల్పించారని, కానీ ఆ హక్కులను నేటి పాలకులు, అధికారులు కాలరాసేలా చేస్తున్నారని అన్నారు. ఈ నిరసన ద్వారా అయినా అధికారులు స్పందించి తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, సంతోష్, దుర్గాప్రసాద్, దుర్గబాబు, కొండబాబు, రామకష్ణ, శ్రీను, అప్పన్న, రమణ పాల్గొన్నారు.

## మానవత్వానికి ప్రతీక రక్తదానం : మంత్రి

ప్రజాశక్తి - కాకినాడ

రక్తదానం చేస్తున్న దాతను అభినందిస్తున్న మంత్రి సుభాష్

మానవత్వానికి ప్రతీక రక్తదానం అని కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం నగరంలోని న్యూరోస్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 4వ వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదానం, ఉచిత వైద్య శిబిరాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన పలువురు యువకులను మంత్రి అభినందించారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించి ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చేలా వైద్యులు, విద్యావంతులు కృషి చేయాలని కోరారు. విలువైన రక్తాన్ని మనం సృష్టించలేమని, కేవలం దానం చేయడం ద్వారా మాత్రమే రక్త నిధి ఏర్పడుతుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయవచ్చునని అన్నారు. ప్రమాదాలకు గురైన ఎంతోమంది సమయానికి రక్తం లభించక మృతి చెందుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. అన్నదానం ఆకలి తీరిస్తే, రక్తదానం ప్రాణాలు నిలబెట్టుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు, తల సేమియా రోగులు, డెంగ్యూతో ప్లేట్ లెట్స్ కౌంట్ తగ్గిన జ్వరం బాధితులకు రక్తం చాలా అవసరమన్నారు. రక్తం యొక్క ఆవశ్యకతను గుర్తించి రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన న్యూరో స్టార్ మల్టీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ అశోక్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ జ్యోతుల, ఆసుపత్రి సిబ్బందిని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ చేతుల మీదుగా రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మంత్రి సుభాష్‌ను హాస్పిటల్ ఛైర్మన్ అశోక్‌కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జివిఎన్‌బిఆర్.శాస్త్రులు, హాస్పిటల్ వైద్యులు సూర్యకాంత్ అరవింద్, హారిక, నవ్య, సుమంతి, సిబ్బంది పాల్గొన్నారు.

## కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి- సామర్లకోట

విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ కంప్యూటర్ విద్యపై అవ గాహన పెంచుకోవాలని ఎంఇఒ-2 పి. పుల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఉండూరు ప్రకాశరావు పేట ఎంపిపి పాఠశాలలో దాతల సాయంతో విద్యార్థులకు 13 కంప్యూటర్స్‌ను ఏర్పాటు చేశారు. శనివారం ఆయన కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను పరిశీలించారు. కంప్యూటర్ల ఏర్పాటుకు కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్‌ను ఆయన అభినందించారు.

## ఆలయానికి రూ.3.84 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.3.84 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.2,81,730, అన్నదాన విరాళాల ద్వారా రూ.74,221, కేశఖండన ద్వారా రూ.5,480, తులాభారం ద్వారా రూ. 250, లడ్డు ప్రసాదాల ద్వారా రూ.23,160, కానుకల ద్వారా రూ.100 వెరసి రూ 3,84,941 ఆదాయం సమకూరిందని వివరించారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణా చార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సేవలందించారు.

## సిపిఎం నియోజకవర్గ కన్వీనర్‌గా నక్కెళ్ల

ప్రజాశక్తి - తుని

సిపిఎం తుని నియోజకవర్గ కన్వీనర్‌గా నక్కెళ్ళ శ్రీనివాస్ ఎంపికయ్యారు. శనివారం తునిలో సిపిఎం సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బేబీరాణి, దువ్వా శేషబాబ్జి పాల్గొని నియోజకవర్గ కన్వీనర్‌గా నక్కెళ్ళ శ్రీనివాస్‌ను ప్రకటించారు. ఈ సమావేశంలో కోటనందూరు మండల కన్వీనర్ షేక్ పద్మ, మల్లేశ్వరరావు, దేవి పాల్గొన్నారు.

## ఈ నెల 6 లోపు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు, కరప

తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలలో ఓటర్ నమోదును ఈ నెల 6లోపు చేయించుకోవాలని తహశీల్దార్ పి.త్రినాథరావు, ఎంపిడిఒ సత్యనారాయణ తెలిపారు. 2021 అక్టోబర్ 31కి ముందు పట్టభద్రుల డిగ్రీ కలిగిన వారు ఓటు నమోదుకు అర్హులన్నారు. ఫారం 18 ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. దీనికి డిగ్రీ సర్టిఫికెట్, ఓటర్ ఐడి కార్డు, ఏదైనా నివాస ధ్రువపత్రం, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జత చేసి ఇవ్వాలన్నారు. ఆఫ్, ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. కరప మండలంలోని డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నిమిత్తం ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ అనుపమ, తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ కోరారు. శనివారం స్థానిక చంద్రన్న సమావేశం మంది రంలో ఓటరు నమోదుపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 221 అక్టోబర్ 10వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారంత ఈ నెల 6వ తేదీలోగా పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు.

## సాయిసుధలో చర్మ సౌందర్య వైద్య సేవలు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని సాయి సుధ ఆసుపత్రిలో చర్మ సౌందర్య సంబంధిత వైద్య సేవలను ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి అధినేత డాక్టర్ వాడ్రేవు రవి తెలిపారు. శనివారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు చంద్రకళ, సుధలతో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివారం సాయిసుధ ఆసుపత్రి ప్రాంగణంలోని 4వ అంతస్తులో ఈ సేవలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సమాజంలో చర్మం, జుట్టు, కాస్మెటిక్ వంటి సౌందర్య అవసరాలకు విపరీతమైన డిమాండ్ పెరుగుతుందన్నారు. మొటిమల మచ్చలు, చర్మం బిగుదుగా మారడం, చర్మ వృద్ధాప్యం, మొటిమలు ఇంకా చర్మాలకు అవసరమైన ఔషధాలు అందించడం కోసం ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తున్నామని చెప్పారు. వంశ జన్యుపరంగా కొన్ని వ్యాధులు వస్తాయని, అందులో కొన్ని రకాలను మార్చుకునే అవకాశం ఏర్పాటు చేశామని చెప్పారు. ఆసుపత్రిలో సమగ్ర సేవలు అందించేందుకు అనుభవజ్ఞులైన వైద్యులను నియమించామని చెప్పారు.

## 'జిజిహెచ్‌కు అసౌకర్యం సుస్తీ' కథనానికి స్పందన

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రజాశక్తిలో శనివారం వచ్చిన 'జిజిహెచ్‌కు అసౌకర్యం సుస్తీ' అనే కథనానికి అధికారులు స్పందించారు. జిజిహెచ్ నోడల్ అధికారి డాక్టర్ కె.అనిత వివరణ ఇస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. సంబంధిత రేడియోలజీ హెచ్‌ఒడి విచారించగా రేడియోగ్రాఫర్ పోస్టుల్లో ఖాళీలు లేవని తెలిపారు. ఎక్సరే అల్ట్రాసౌండ్ మిషన్లు సంబంధించి 6బి గదిలోని ఎక్సరే యంత్రం మరమ్మతుల్లో ఉండడం వాస్తవమేనని, అయితే సైరీస్ హెల్త్ కేర్ ద్వారా మరమ్మతు కోసం సమాచారం అందించామన్నారు. మిషన్ రిపేర్ అయ్యేంత వరకు రోగి బాధలను నివారించడానికి ప్రత్యామ్నాయంగా మొబైల్ ఎక్స్-రే యంత్రం ఏర్పాటు చేశామని వివరణ ఇచ్చారు. గది నెంబరు 8లో ఉన్న మూడు ఎక్స్-రే యంత్రాలలో ఒకటి మాత్రమే పని చేస్తున్నదన్నారు. ఎన్ఐసియు, పిఐసియు, జిఐసియులో ఎక్స్-రే యంత్రాలు పని చేస్తున్నాయన్నారు. ఎక్సరే ఫిల్మ్‌లు అందు బాటులో లేకపోవడాన్ని అధిగమించడానికి, రోగుల సంరక్షణ కోసం అన్ని సంబంధిత విభాగాల్లో పిఎసిలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ఎక్స్-రే, అల్ట్రా సౌండ్ గదుల కొలతలు ప్రణాళిక, రేడియేషన్ ప్రమాదాలకు వ్యతిరేకంగా రేడియేషన్ రక్షణ చర్యలు ఎఇఆర్‌బి మార్గదర్శకాల ప్రకారం ఉన్నాయన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక టిడ్కో విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతులలో భాగంగా నేటి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఆదిత్య ఫీడర్, టిడ్కో ఫీడర్‌ల నుంచి విద్యుత్ సరఫరా జరిగే ఇండస్ట్రియల్ పార్క్, ఆదిత్య కళాశాల, సూరంపాలెం రోడ్డు జగనన్న కాలనీ, పెద్దాపురం - ఆనూరు అగ్రికల్చర్ లైన్, బృందావన్ కాలనీ, వాలు తిమ్మాపురం రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

### కార్టూ'నిజం'




## కొనసాగిన వాలంటీర్ల ఆందోళన

ప్రజాశక్తి - గొల్లప్రోలు, కాకినాడ రూరల్, ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న వాలంటీర్లు

గొల్లప్రోలులో గ్రామ, వార్డ్ వాలంటీర్లు చేపట్టిన ఆందోళన 2వ రోజు కొనసాగింది. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద వాలంటీర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకుడు కె,చిన్న, వాలంటీర్ల సంఘం నాయకుడు ఎ.ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పార్టీల నేతలు వాలంటీర్లకు అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. వాలంటీర్లు రాజీనామాలు చేయవద్దని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లను కొనసాగించడంతోపాటు, వేతనాలను రూ.10 వేలకు పెంపుదల చేస్తామని హామీని మఅలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, ప్రసాదు, నాగమణి, నీలిమ, రాజకుమార్, మౌనిక, ఉమాదేవి, అప్పారావు పాల్గొన్నారు. కాకినాడ రూరల్ రెవెన్యూ కార్యాలయం వద్ద వాలంటీర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రూరల్ మండల కన్వీనర్ టి.రాజా మాట్లాడారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి 5 నెలలు గడిచినా వారు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఈ నెల 6న జరిగే క్యాబినెట్ మీటింగ్‌లో వాలంటీర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, దుర్గాప్రసాద్, శ్రీహరి, వాలంటీర్ల సంఘం నాయకులు డి.గంగాభవాని, బొంతు సంధ్యదేవి, అనిత, భవాని, కీర్తి పాల్గొన్నారు. ప్రత్తిపాడు రెవెన్యూ కార్యాలయం వద్ద వాలంటీర్లు రెండో రోజు తమ నిరసనను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పాల్గొని మాట్లాడారు. వాలంటీర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పి.భవాని, దొర, ప్రశాంతి, శ్రీదేవి, ముత్యాలు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

## గొల్లప్రోలులో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శనివారం గొల్లప్రోలులో పర్యటించారు. త్వరలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గొల్లప్రోలు పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కలెక్టర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా భారీ సభను ఏర్పాటు చేసే ఆలోచనలో జనసేన పార్టీ నాయకత్వం ఉంది. పవన్ కళ్యాణ్ పాల్గొనే సభ ఎక్కడ నిర్వహించాలి? అనువైన ప్రాంతం ఎక్కడ ఉందనే అంశాలపై కలెక్టర్ పలు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల చుట్టూ ఉన్న ప్రాంతాన్ని, వేదికను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.స్వప్న, ఎస్ఐ పి.రామకృష్ణ, ఎంఇఒలు నాయుడు వెంకటేశ్వరావు, బి.శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 చేయాలని సిఐటియు ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొవ్వాడ పంచాయతీ కార్మికుల సమావేశం జరిగింది.కొవ్వాడ పారిశుధ్య కార్మికుల కమిటీ కన్వీనర్ కె.నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటికీ రూ.6 వేలు లేదా రూ.7 వేలతో వెట్టి చాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లు పూర్తిగా పనిచేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సత్తిబాబు, పల్లారావ్, లక్ష్మి, వీరబాబు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## తాటాకిల్లు దగ్ధం

**ప్రజాశక్తి - యు.కొత్తపల్లి**

ఉప్పాడ గ్రామపంచాయతీ పరిధిలోని మాయపట్నంలో ఒక తాటాకు ఇల్లు దగ్ధం అయింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం..శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన బడే కృష్ణకు చెందిన ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయని తెలిపారు. రాత్రి సమయం కావడంతో ఇంటిలో వస్తువులను కూడా బయటకు తెచ్చుకునే పరిస్థితి లేకపోవడంతో తన కుటుంబం కట్టుబట్టలతో మిగిలిపోయిందని బాధితుడు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. బాధిత కుటుంబాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. ప్రభుత్వం నుంచి సాయాన్ని రప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జనసేన నాయకులు సాన నాగు, మెరుగు రవి పాల్గొన్నారు.

## ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**ప్రజాశక్తి - జగ్గంపేట**

జగ్గంపేటలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన ప్రకారం రాజమహేంద్రవరం నుంచి ఎర్రవరం వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని కృష్ణవేణి సెంటర్ వద్ద ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాయాలపాలయ్యాడు. హైవే పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని గాయాలపాలైన డ్రైవర్‌ను స్థానిక సిహెచ్‌సికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో ఎదుట భాగం నుజ్జు నుజ్జయింది.

## బాలికపై అత్యాచారం

**ప్రజాశక్తి - రాజోలు**

బాలికపై అత్యాచారం జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి పొన్నమండ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొన్నమండ గ్రామానికి చెందిన బాలిక (17) తల్లిదండ్రులు మరణించడంతో నాన్నమ్మ సంరక్షణలో ఉంటోంది. వద్దురాలికి అనారోగ్యంగా ఉండటంతో కొద్దిరోజుల క్రితం కుమార్తె ఇంటికి వెళ్లింది. బాలిక ఒంటరిగా ఉండటం గమనించిన అదే గ్రామానికి చెందిన ములపర్తి వినయ్ శుక్రవారం అర్ధరాత్రి బాలిక ఇంటికి వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు.బాలిక బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

**ప్రజాశక్తి - ముమ్మిడివరం**

యానాం నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ముమ్మిడివరం ఎక్సైజ్ సిఐ ఎల్.చిరంజీవి తెలిపారు. వివరాల మేరకు జగ్గం పేటకు చెందిన గాడి చక్రి భగవాన్ యానాం నుంచి మద్యం సీసాలు తరలిస్తుండగా శనివారం అన్నంపల్లి వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. చక్రి భగవాన్ అనే వ్యక్తిని మద్యం తరలిస్తుండగా అన్నంపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతడి నుండి తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే టాస్క్ ఫోర్స్ సిబ్బంది బెల్ట్ షాపుల పై దాడులు చేయగా ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితుల పైనా కేసు నమోదు చేసి, నిందితులిద్దరిని కోర్టుకు తరలించినట్లు సిఐ తెలిపారు.

## కారు ఢీ కొని వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - రాజానగరం**

తూర్పుగోనగూడెం సమీపంలో కారు ఢీ కొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. మండలంలో సీతారాంపురం గ్రామానికి చెందిన తామల్ల నారాయణ (70) రామస్వామిపేటలో కుమార్తె ఇంటికి మోటారు సైకిల్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా తూర్పుగోనగూడెం శివాలయం సమీపంలో జాతీయ రహదారి దాటు తుండగా జగ్గంపేట నుండి వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అవినీతి రహిత సమాజం అవసరం

**ప్రజాశక్తి - గండేపల్లి**

ప్రస్తుత పరిస్థితుల్లో అవినీతి రహిత సమాజం అవసరమని డిఎస్‌పి డి.శ్రీహరిరాజు అన్నారు. సూరంపాలెం పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లో జరుగుతున్న విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి పౌరుడు అవినీతిని అరికట్టడంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రజలందరికీ తమ వంతు సహకారంగా అవినీతికి వ్యతిరేకంగా అవగాహన పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా డిజిఎం పవన్ కుమార్ మాట్లాడుతూ విజిలెన్స్ అవగాహనా వారోత్స వాల్లో పవర్ గ్రిడ్ గ్రామ సభలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పవరగ్రిడ్ మేనేజర్లు కోటేశ్వరరావు, వీరేంద్ర, మూర్తి, సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఏలేశ్వరం**

మండలంలోని ఎర్రవరం గ్రామంలో సంకురాత్రి ఫౌండేషన్, కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ అమర నరసింహ మూర్తి రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు, మందులు అందజేశారు. వీరిలో 40 మందికి ఐఎల్ ఆపరేషన్ నిమిత్తం కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బస ప్రసాద్, మైరాల కనకారావు, వైద్యులు డాక్టర్ గీతప్రియ, సుమిత, లలిత, అనిత ఫౌండేషన్ పిఆర్ఓ గణేష్, వెంకట్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా మత్స్యకార ఎన్నికలు

**ప్రజాశక్తి - పెద్దాపురం**

మండల పరిధిలో 4 మత్స్యకార సహకార సంఘ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయని మత్స్యశాఖ కార్యాలయం ఇన్‌ఛార్జ్ పద్మ తెలిపారు. గంగా భవాని ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కడగల సత్యనారాయణ, సిమ్మ రాఘవ, కమిటీ సభ్యులుగా బొట్టు వెంకన్న, సమ్మంగి గోవిందు, శెట్టి రమేష్, చిట్టి మాని శ్రీను, వాలు తిమ్మాపురం వెంకటేశ్వర ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులుగా బాడితమాని శ్రీనివాస్, వెంకటపర్తి వీర్రాజు, రాయభూపాలపట్నం ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులుగా వడ్లపాటి పెద్దచిన్న, బాంద్రు వీరరాఘవ, ఆనూరు ఫిషర్‌మెన్ సొసైటీకి అధ్యక్ష, కార్యదర్శులుగా నూకతట్టు గంగారావు, బాడ సత్యనారాయణ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి పత్రాలను అందజేశామన్నారు.

# ఆశలపై నీళ్లు

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి**

తేదేపా కూటమి ప్రకటంచిన సూపర్ సిక్స్ పధకాలు ఆచరణలో తలకిందులవటంతో ఆశలపై నీళ్ల చల్లారనే అభిప్రాయం ప్రజలతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఉచిత ఇసుక, మద్యం ధరల నియంత్రణపై బిన్నమైన పరిస్థితులు నెలకొన్న విషయం విధితమే. ఇప్పటికీ ఇసుక కొరత వేదిస్తోంది. మద్యం ధరలు తగ్గకపోవగా బెల్ట్ షాపులు ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. ఎక్సైజ్ శాఖ కొరడా జులిపిస్తున్నా ఫలితం లేకపోయింది. అదే విధంగా విద్యార్థులకు ఆసరాగా నిలిచే తల్లికి వందనం ఊసే లేదు. మరోవైపు పరీక్షల సమయంల దగ్గర పడటంతో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు ఫీజు రియంబర్స్ మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా దీపావళి రోజు ఆర్భాటంగా ప్రకటదించిన ఉచిత గ్యాస్ పథకం కూడా మేడిపండు చందంగా మారింది. ఎన్నికల ముందు ప్రతి ఇంటికీ 3 సిలిండర్లు ఉచితం అని ప్రకటించిన విషయం విధితమే. తాజాగా రేషన్ కార్డు ప్రమాణికంగా తీసుకోవటం, తొలుత నగదు చెల్లించాలని ఆపై సబ్సిడీ నగదు ఖాతాల్లో జమ చేస్తామనిచెప్పటంతో వినియోగదారులు ఖంగు తిన్నారు. పాలకులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

### దిగుబడి కొండంత, లక్ష్యం గోరంత

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారింది. ప్రతి సీజన్‌లోనూ పాలనా యంత్రాంగం చిత్తశుద్ధి లోపు రైతులను నట్టేట ముంచుతోంది. ఈ ఏడాదీ నత్తనడక కొనుగోలు జరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పటి వరకూ 30 శాతం కోతలు పూర్తయినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు నామమాత్రంగానే ధాన్యం చేరినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాల ప్రకారం అత్యధిక ధాన్యం దళారులు కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా కాగా ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం 8 లక్షల మెట్రిక్ టన్నులకు మించలేదు. గత ఏడాదిగా బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్న విషయం విధితమే. బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు అధికంగా ఉన్నప్పటికీ రైతులకు మద్దతు ధర లభించడంలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల్లో తేమ శాతం నిబంధనలు ప్రధాన అడ్డంకిగా మారినట్లు రైతులు వాపోతున్నారు. అల్పపీడన ప్రభా వంతో వర్షాలు కురవటం, వాతావరణ ప్రతికూల పరిస్థితులు రైతులను వెంటాడుతున్నాయి. అదే విధంగా అత్యధికంగా సాగు చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సహకారం మేడి పండు చందంగా మారు తోంది. గుర్తింపు కార్డులు లేక దళారులను ఆశ్రయిం చాల్సి వస్తోంది.

### కూరగాయలు, నిత్యావసరాలు పైపైకి

ఓవైపుకూరగాయల ధరలు... మరో వైపు నిత్యావసర సరుకుల ధరలు కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.70కి చేరిన విషయం విధితమే. ప్రభుత్వం రైతు బజార్లలో రూ.50లు చొప్పున నాణ్యతలేని ఉల్లిపాయలు విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో కొనుగోలు దారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు.అల్లం కేజీ రూ.150కి చేరింది. వెల్లుల్లి పాయలు కేజీ 360కి చేరాయి. కూరగాయాలు కేజీ కొనుగోలు చేయాలంటే ఏరకమైనా రూ.50పై మాటే. మరో వైపు బియ్యం ధరలు ఇప్పటికే పెరిగి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బియ్యం ధరల పెంపునకు కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న జిఎస్‌టి కారణమని వ్యాపారు లు చెబుతున్నారు. ఆదాయానికిమించి నిత్యావసర ఖర్చులు పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది.

### చుట్టుముడుతున్న సీజనల్ వ్యాధులు

జిల్లా ప్రజలను సీజనల్ వ్యాధులు చుట్టుముట్టడంతో ఆనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన రెండు వారాలుగా చలి తీవ్రత పెరిగింది. ఈ నేపథ్యంలో శ్వాసకోశ వ్యాధి గ్రస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు నేతి బీర చందంగా మారాయి. బ్లడ్ టెస్ట్‌లు మొదలుకొని వివిధ రకాల పరక్షలు, మందులు ప్రభుత్వ ఆస్పత్రులలో లభించడంలేదు. అత్యధిక మందిని జిల్లాలో ప్రధాన ఆస్పత్రులైన రాజమహేంద్రవరం, కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వెనకడుగు వేస్తున్నారు. తప్పని సరి పరిస్థితులలో తమ గ్రామాల్లోనే ఆర్‌ఎంపిలు, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఛైర్మన్ రోహిత్

## రామ్‌కుమార్‌కు ఘన నివాళి

**ప్రజాశక్తి - అన్నవరం**

వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ కీర్తిశేషులు రాజా ఐవి.రామకుమార్ 9వ వర్ధంతి సేవా కార్యక్రమాల నడుమ సాగింది. శనివారం రత్నగిరిపై ఛైర్మన్ బంగ్లాలో రామ్‌కుమార్ చిత్రపటానికి ప్రస్తుత ఛైర్మన్ ఐవి.రోహిత్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఐవి.రోహిత్ పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

**ప్రజాశక్తి - పెద్దాపురం**

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో తాడిశెట్టి గంగాధరరావు అధ్యక్షతన జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ రంగానికి చెందిన అన్ని విభాగాల కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల సొమ్ము వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇసుక సమస్య వల్ల భవన నిర్మాణ రంగంలో పనులు నత్తనడకన నడుస్తున్నాయని, దీనివల్ల పని లేక భవన నిర్మాణ కార్మికులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుకను నిర్మాణదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం ఇటీవల శిక్షణ పొందని ఎలక్ట్రికల్ రంగం కార్మికులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కందిరెళ్ళ దుర్గాప్రసాద్, పి.జోగుబాబు, సర్వశుద్ధి శ్రీను, కాకి దుర్గ, రొంగల రమేష్, షేక్ ఇబ్రహీం, అగ్రహారపు గణేష్ పాల్గొన్నారు.

## కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం

**ప్రజాశక్తి - యంత్రాంగం**

**పిఠాపురం** దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యక్షేత్రం పాదగయకు భక్తులు పోటెత్తారు. భక్తులు పాదగయ పుష్కరిణలో పుణ్య స్నానాలు ఆచరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. **సామర్లకోట** స్థానిక భీమేశ్వర ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఎపి ఉపలోకయుక్త పి.రజిని కుటుంబ సమేతంగా భీమేశ్వర ఆలయంలో కార్తిక మాస ఉత్సవాల్లో పాల్గొన్నారు. భీమేశ్వరాలయంలో కార్తీక మాస ఉత్సవాల ఏర్పాట్లను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప శనివారం రాత్రి పరిశీలించారు. **తాళ్లరేవు** స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీకమాస అన్నదానం కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, పెసింగి ఈశ్వరరావు, గుత్తుల సాయి, మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లోని వెంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద శనివారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. గండేపల్లిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం క్రీశేషులు కంటిపూడి బంగారమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు ఆర్థిక సాయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు.

పిఠాపురం పాదగయలో భక్తులతో కిటకిట

## దుకాణం తొలగింపుపై వివాదం

**ప్రజాశక్తి - కాకినాడ**

కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోని సిద్ధి వినాయక దుకాణం తొలగింపుపై వివాదం చోటుచేసుకుంది. తన దుకాణం నిర్వహణ గడువు ముగిసిపోవడం వాస్తవమేనని, అయితే తాను 5 రోజులు గడువు మాత్రమే అడిగానని, అయినా బలవంతంగా దుకాణాన్ని ఖాళీ చేయించడంపై దుకాణదారుడు చొల్లంగి వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇంతవరకూ ఎటువంటి బకాయిలు లేనని అయినా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయాడు. ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ఈ వివాదంపై ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్ వివరణ ఇస్తూ గడువు ముగిసిందని, మరోకరు వేలం పాటలో దక్కించుకున్నా, సంబంధిత ఆసామి దుకాణాన్ని ఖాళీ చేయడం లేదని, ఆయన అడిగిన గడువు సైతం ముగిసిపోయిందని వివరించారు. దుకాణంలో ఉన్న సామాన్లు భద్రపరుస్తున్నామని, ఆ దుకాణదారుడు ఎప్పుడైనా తీసుకెళ్లవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని దుకాణం వద్దకు పలువురు బీసీ నాయకులు చేరుకుని చొల్లంగి మద్దతుగా నిలిచారు.

## పిహెచ్‌సిని పరిశీలించిన డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి - కాజులూరు**

మండలంలోని దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ జె.నరసింహనాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గుదూరు పిహెచ్‌సి సేవలను మరింతగా విస్తరింప చేయాలని స్థానికంగా కొందరు నాయకులు కోరారని, ఇందులో భాగంగానే పిహెచ్‌సిని సందర్శించినట్లు చెప్పారు. ప్రతిరోజు ఆరోగ్య కేంద్రానికి వచ్చే ఒపీని, స్థానిక జనాభా వివరాలు సేకరించామన్నారు. తద్వారా పిహెచ్‌సి స్థాయి నుంచి సిహెచ్‌సిగా మార్చేందుకు ఉన్న అవకాశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు నివేదిస్తానని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చాలంటే మూడు పిహెచ్‌సీలు ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు సుప్రియ, జి.స్వాతి, సహకార సంఘం మాజీ అధ్యక్షులు కొప్పిశెట్టి స్వామినాయుడు, ఆసుపత్రి కమిటీ మాజీ ఛైర్మన్ పోతు పరమేశ్వరరావు, కూటమి నాయకులు దూడల శంకర్‌నారాయణ, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

## సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - కాకినాడ**

కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలను జయప్రదం చేయాలని డిఇఒ పిల్లి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌశల్-2024 గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా పాఠశాల విద్యాశాఖ సహకారంతో కౌశల్-2024 నిర్వహిస్తున్నారన్నారు. కౌశల్-2024నందు క్విజ్, పోస్టర్, షార్ట్ ఫిల్మ్, రిల్స్ అంశలలో పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు www.bvmap.org అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 5వ తేదీ లోపు వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యంలో నడపబడుతున్న పాఠశాలకు మాత్రమే ఈ కౌశల్ పోటీలలో పాల్గొనాలని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను బహూకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్, కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.చలపతి, ప్రధానకార్యదర్శి కెఎన్.శ్రీనివాస్, కౌశల్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు, కౌశల్ జాయింట్ కోఆర్డినేటర్ పి.సూర్యమెహన్ రెడ్డి, పి.రవిశంకర్ పాల్గొన్నారు.

## తప్పని తాగునీటి కష్టాలు

**ప్రజాశక్తి - యు.కొత్తపల్లి**

కొత్తపల్లి, కుతుకుడి మిల్లి గ్రామాల్లో పలుచోట్ల వీధి కుళాయిలు రాక గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారు. సక్రమంగా తాగునీరు అందించవలసిన అధికారులు పట్టించుకోక పోవడంతో దూరప్రాంతానికి వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల ద్వారా తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియక పనులు మానుకుని ఎదురుచూపులు చూడాల్సి వస్తుందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు నాగులపల్లి రక్షిత మంచినీటి పథకం ఉన్నా ఫలితం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ పథకం పనిచేయకపోవడమా? లేక అధికారుల నిర్లక్ష్యమో అర్థం కాని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు తాగునీటి కష్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

## 'పట్టు రైతులను ఆదుకోవాలి'

**ప్రజాశక్తి - గొల్లప్రోలు**

కంపెనీలు చేసిన మోసానికి నష్టపోయిన పట్టు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. పట్టు సాగుబడి చేసే రైతులు రెండు నెలల నుంచి దళారుల నుంచి గుడ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ఆ గుడ్ల నాణ్యత లేకపోవడం వల్ల పంట దిగుబడి తగ్గిపోవడంతో రైతులు భారీగా నష్టపోయారన్నారు. దళారీలు తెచ్చిన గుడ్లను పరిశీలన చేసిన తరువాత రైతులకు అందజేయాలని, పండించిన పంటకు చేబ్రోలు పట్టు పరిశ్రమ వద్దే ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు చేస్తున్న ఆందోళనకు సిపిఎం మద్దతుగా నిలుస్తుందన్నారు.

## అనధికార లే అవుట్‌లపై చర్యలు

**ప్రజాశక్తి- తాళ్లరేవు**

మండలంలోని పలు గ్రామాల్లో అనధికారికంగా వెలసిన లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని చొల్లంగి పేట మాజీ సర్పంచ్ మైదు హరి బాబు కోరారు. శనివారం తహశీల్దార్ పి.త్రినాధ రావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## దరఖాస్తుల తేదీ పొడిగింపు

**ప్రజాశక్తి - పెద్దాపురం**

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్ష చివరి తేదీని ఈనెల 9వ తేదీ వరకూ పొడిగించినట్లు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ వెబ్ సైట్ ద్వారా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వివిఎస్ విద్యార్థుల ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - యు.కొత్తపల్లి**

వివిఎస్ విద్యార్థులు శుక్రవారం అర్ధరాత్రి ఉప్పాడలో ఉన్న మాయా పట్నం గ్రామంలో ఇల్లు కాలి పోయిన బాధిత కుటుంబానికి శనివారం రూ.5000 ఆర్థిక ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కష్టాల్లో ఉన్న వారిని వివిఎస్ విద్యార్థులు తమ వంతుగా సాయం అందిస్తారని అన్నారు.


### CHANGE OF NAME

I **DEEPATI ANURADHA** (New Name) W/o Deepati Sudhir Kumar, Resident of Door No. 4-338, Turpupalem Village, Malkipuram Mandal, Dr. B.R.Ambedkar Konaseema Dist. AP. I Hence by declare that my Name has been changed From **ANU RADHA PITTA** (Old Name) to **DEEPATI ANURADHA** (New Name) Hence all my documents and correspondence will continue With My New Name of **DEEPATI ANURADHA.**

### సర్టిఫికెట్ పడిపోయినవి

ముమ్మిడివరం మండలం, పల్లిపాలెంకు చెందిన వంగలపూడి ఆకాష్ S/o. శ్రీనివాసరావు కు చెందిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ పడిపోయినది. మార్చ్ 2019లో బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఆంధ్రప్రదేశ్ వారు జారీ చేసిన **సర్టిఫికెట్ రిజిస్టర్ నెంబర్ 1903255407, సీరియల్ నెంబర్ 809909** సర్టిఫికెట్ 20-10-2024వ తేదీన జిరాక్స్ నిమిత్తము పల్లిపాలెం నుండి ముమ్మిడివరంకు వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. సర్టిఫికెట్ దొరికిన వారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

**వంగలపూడి ఆకాష్**
S/o. శ్రీనివాసరావు, డోర్ నెంబర్ 3-190,
పల్లిపాలెం, ముమ్మిడివరం, ముమ్మిడివరం మండలం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ 9676407615

### సర్టిఫికెట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, అల్లవరం గ్రామానికి చెందిన పెచ్చెటి శ్రీ దుర్గ చంద్రిక, D/o. భాస్కరరావు కు చెందిన పదవ తరగతి మార్కుల లిస్ట్ పడిపోయినది. **మార్కుల లిస్టు రోల్ నెంబర్: 0292447.** నా ఒరిజినల్ మార్కుల లిస్ట్‌ను తీసుకుని ఇంటి వద్ద నుండి కొమరగిరిపట్నంలోని జిరాక్స్ సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

**పెచ్చెటి శ్రీదుర్గ చంద్రిక**
D/o. భాస్కరరావు, డోర్ నెం. 4-100
మలయ్యగారిపాలెం, కొమరగిరిపట్నం


## సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ

**ప్రజాశక్తి - యంత్రాంగం**

**గొల్లప్రోలు** గొల్లప్రోలు మండలంలోని చిన్న జగ్గంపేటలో శనివారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎస్.కె.మస్తాని పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన భూ సర్వేలో లోపాలను సరిదిద్దాలని పలువురు రైతులు వినతిపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కేదారేశ్వరరావు, ఆర్ఐ బాలకృష్ణ, విఆర్ఓ బి.నారాయణరావు, రైతులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని శీల గ్రామంలో రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో తహశీల్దార్ శివకుమార్ పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం.సూర్యనారాయణమూర్తి, ఆర్ఐ వేగేశ్వరరావు, సర్పంచ్ కోమలి వెంకటరమణ, విఆర్ఒ ఎస్.సూర్యనారాయణమూర్తి, రైతులు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో సర్పంచ్ కురుమెళ్ళ లోవరాజు అధ్యక్షతన రీ సర్వే గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి పాల్గొని రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ నెల 21వ తేదీ వరకూ జరిగే గ్రామ సభలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సభలో కార్యదర్శి ఎండిఎంకె.షావలి, విఆర్ఒ వెంకటేశ్వరరావు, స్థానిక టిడిపి నాయకులు రేలంగి బుజ్జి, రేలంగి వెంకట్రావు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని పనసపాడు గ్రామంలో సర్పంచ్ చీకట్ల వెంకటేష్ అధ్యక్షన రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.


### పత్రికా సమాచారం

కాకినాడ జిల్లాలో గల St. Ann's ఎయిడెడ్ Girls ప్రైమరీ పాఠశాల, జగన్నాధపురం, కాకినాడ నందు గల 07(క్రిస్టియన్ మైనారిటీ) ఉపాధ్యాయుల పోస్టులకు భర్తీ కొరకు Online ద్వారా ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలియజేయునది ఏమనగా, సదరు Online ద్వారా Submit చేసిన ధరఖాస్తులు, విద్యార్హతలు సర్టిఫికెట్లు, TET అర్హత గల సర్టిఫికెట్లు మరియు క్రిస్టియన్ మైనారిటీ (MROచే జారీచేయబడిన) సర్టిఫికెట్లను, 02 పాస్ పోర్టు సైజు ఫోటోలను ధరఖాస్తునకు జతపరచి మేనేజరు St. Ann's ఎయిడెడ్ Girls ప్రైమరీ పాఠశాల, జగన్నాధపురం, కాకినాడ వారికి వ్యక్తిగతంగా కానీ రిజిస్టరు పోస్టు ద్వారా కానీ ది. 09- 11-2024వ తేదీ లోగా సమర్పించవలసినదిగా మరియు సదరు అభ్యర్థుల యొక్క సర్టిఫికెట్లను తనిఖీ చేసి అర్హత గల అభ్యర్థులకు మాత్రమే Written Test నిర్వహించి,ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులలో ఎంపిక చేయబడిన అభ్యర్థులకు Interview నిర్వహించబడునని తెలియజేయడమైనది.

సంబందిత అర్హత గల అభ్యర్థుల యొక్క Written Test మరియు ఎంపిక చేయబడిన అభ్యర్థులకు Interview నిర్వహించు తేదీలను తరువాత పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయబడునని మేనేజరు St.Ann's ఎయిడెడ్ Girls ప్రైమరీ పాఠశాల, జగన్నాధపురం, కాకినాడ వారు తెలియజేసియున్నారు.

**మేనేజరు**
**ST. ANN'S ఎయిడెడ్ GIRLS ప్రైమరీ పాఠశాల, జగన్నాధపురం, కాకినాడ**

### మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
**MVOP No. 12/2019**

*Between:*
Shaik. Men. S.V.V.Ramana & Other ...*Petitioners*
AND
Jatla Shiva Sankar & Others ...*Respondents*

**R-1**: జట్ల శివశంకర్ తండ్రి: వీరబాబు, వయస్సు 22 సం॥, కాపు, ముత్తా నగర్, కాకినాడ, కాకనాడ జిల్లా. (ట్రక్ ఆటో డ్రైవర్, బెరింగ్ నెం.AP.5.TC.2989

పై నంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినప్పటికి తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం ది. **13-11-2024** తేదీన వాయిదా అయి ఉన్నది. ఆ రోజు ఉదయం **10.30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించ బడునని తెలియపరచడమైనది.

*(By Court Order)*
**K.V.BHADRA RAO**
**K.SRIVANI**
**K.S.CHANDRA RAO**
Advocates, kakinada
Cell.9440177063

### మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
**M.V.O.P. No. 131/2023**

*Between:*
Palivela Kappala Aadhi Lakshmi Devi ...*Petitioner*
AND
**R-1:** Shaik Shavali Bhasha, S/o. Shaik Nazeer, aged about 27 years, Driver of Auto AP 05 TD 0326, R/o. D.No. 16-91, Netaji Nagar, Yerrakonda, Dowlaiswaram, East Godavari District.
**R-2:** Juthuga Sathibabu, S/o. Laxmanarao, Hindu, aged about 35 years, Owner of Auto AP 05 TD 0326, R/o. D.No. 1-68, Atchuthapuram, Rajamahendravaram.
...*1, 2, Respondents*

పై నెంబరు పిటిషన్‌లో 1, 2 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 18-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **ఎస్.జి.శంకర్**
02-11-24 అడ్వకేట్, రాజమండ్రి

### మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P No. 7/2023

Between
**పట్నాల ఎన్.వి. ఈశ్వరరావు** ... **పిటీషనర్**
మరియు
**వాకాడ సత్యనారాయణ మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్**
**R1 వాకాడ సత్యనారాయణ**

S/o. అప్పారావు C/o లేటు నందగిరి సంజీవరావు గారి ఇల్లు 42 సం॥లు హిందూ, నిల్ R/o డోర్‌నెం. 19-8-1, మైత్రీ డిజైనర్స్ వీధి, రత్నంపేట, రామచంద్రపురం టౌన్ మరియు మండలం R.C.P.J.C.J.C

పై నెంబరు పిటిషన్ నందు R1 రెస్పాండెంట్ హాజరు నిమిత్తం **ది.08-11-2024** వాయిదా అయి ఉన్నది. కావున మీరు ఆ రోజు **ఉదయం గం 10-30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాబడి మీ సంజాయిషీని తెలియజేసుకోవలెను. లేనిచో సదరు పిటిషన్ ను మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)
**కముజు సూర్యనారాయణ**
రామచంద్రపురం, డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా — వాది తరుపు అడ్వకేటు
02-11-2024 సెల్: 98493 79828

### మహారాజశ్రీ 4వ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కాకినాడ
O S. No 103/ 2023

Between
**బోకం మణి** ... **Plaintiff**
మరియు
**1. తెలుగు చంద్రరావు**
**2. తెలుగు అంజిబాబు ... Defendents**
To,
**D2 తెలుగు అంజిబాబు,** S/o. అచ్చన్న, డోర్‌నెం. 3-8-47/1, సిగల వారివీధి, రేచర్లపేట, కాకినాడ.

పై నెంబరు దావాలో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకోనకుండా కాలయాపన చేయుచున్నందున మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు **ది. 15-11-2024** వ తేదీనకు వాయిదా వేసి యున్నారు. కావున మీరు ఆ రోజు **ఉదయం గం.10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరు అయి మీ అభ్యంతరములు తెలియజేయవలయును. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
**డేనియల్ దినకర్ జేసన్,** అడ్వకేట్,
6-3-70, దంటువారి వీధి, సూర్యారావుపేట, కాకినాడ
కాకినాడ 02-11-2024 సెల్: 98486 11143

### మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
**I.A. No. 2001/2023** in **CMASR No. 10625/2023**

*Between:*
1. Gubbala Naga Mani
2. Gubbala Kalyani
...*Petitioners/ Appellants*
AND
Yelagana Sailaja Niveditha and Others ...*Respondents*

***R-2:*** Devarakonda Venkata Satyanarayana Murthy, S/o. Narasimha Murthy, presently R/o. H.No. 45-6-18, Jagannadhapuram, Kakinada, Owner of House bearing D.No. 18-200/A, Agraharam, Dowlaiswaram, Rajamahendravaram Rural.
...*2nd Respondent*

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 19-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*
రాజమండ్రి **యు.వి.అప్పారావు**
02-11-2024 అడ్వకేట్, రాజమండ్రి

### మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా
**Creditor I.P.No.34/2024**

*Between:*
*Gudimetla Satyanarayana Reddy, S/o. Surreddy, Aged 59 years, Cultivation and Business, Door No. 6-100/1, Main Road, Resident of Ramavaram village, Anaparthi Mandal, Anaparthi*
...***PETITIONER***
AND

**01.** Palikala Manohara Srikanth, S/o Suribabu, Aged 37 years, Business, Door No. 40-14-4, Saikrishna 3rd Street, Mangalavarapupeta, Resident of Rajamahendravaram city, Rajamahendravaram Urban Mandal, Rajamahendravaram.

**02.** Dasari Veera Venkata Ramana, S/o Satyanarayana, Aged 56 years, Cultivation, Door No: 40-14-7/1, Mangalavarapupeta, Resident of Rajamahendravaram city, Rajamahendravaram Urban Mandal, Rajamahendravaram.

**03.** Palikala Uma Maheswari, W/o Suribabu, Aged 59 years, Housewife, Door No. 40-14-4, Saikrishna 3rd Street, Mangalavarapupeta, Resident of Rajamahendravaram city, Rajamahendravaram Urban Mandal, Rajamahendravaram.

**04.** Neelapu Bhargavi, W/o D/o Suribabu, W/o N.J. Rao, Aged 39 years, Housewife, Door No. 4-41-3, Kagitala vari street, Peda Waltair, resident of Visakhapatnam city, Visakhapatnam Urban Mandal, Visakhapatnam
**...1, 2, 3, 4 RESPONDENTS**

పై దావా గ్రంథమునకు సంబంధించి 1వ రెస్పాండెంటును ఇన్‌సాల్వెంటుగా డిక్లేరు చేయమని మరియు 1వ రెస్పాండెంటు అతని కుటుంబ సభ్యులతో కలసి 2వ రెస్పాండెంటు పేరున వ్రాసి ఇచ్చిన క్రయ దస్తావేజు నెం. **17730/2024** తేది. **11-06-2024** రాజమహేంద్రవరం సబ్ రిజిష్టరు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన సదరు దస్తావేజు రద్దు చేయమని పిటీషనర్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనా పై దావా గ్రంథమునకు సంబంధించి ఎటువంటి అభ్యంతరములు కాని, ఆక్షేపణలు కాని ఉన్న ఎడల **ది.05-11-2024 తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గం॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)*
**టి.వి.నారాయణరెడ్డి**
**కె.శ్రీధర్‌రెడ్డి**
రాజమండ్రి — అడ్వకేట్స్
30-10-2024 — రాజమండ్రి